క్లుప్తంగా

నేడు గరుడఖండిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

పలాస: గరుడఖండి పంచాయతీలో సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ పలాస మండల అధ్యక్షుడు పైల చిట్టిబాబు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఎంపీపీ ఉంగ ప్రవీణ, జెడ్పీటీసీ సభ్యుడు మచ్చ రత్నాలు హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

కురేసిని అమ్మవారిని దర్శించుకున్న జెడ్పీ చైర్‌పర్సన్



అమ్మవారిని దర్శించుకుంటున్న చైర్‌పర్సన్ విజయ తదితరులు

కంచిలి: కొసక గిరిజన గ్రామంలో వెలసిన కురేసిని అమ్మవారి జాతర మహోత్సవాలు శని, ఆదివారాల్లో వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా అమ్మవారిని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ శనివారం రాత్రి దర్శించుకొని పూజలు చేశారు. ఎంపీ పైల దేవదాస్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ నిత్య జన్ని ఉన్నారు.

అమ్మవారి హుండీ కానుకల లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న కమిటీ ప్రతినిధులు

కంచిలి: మండల కేంద్రం కంచిలిలోని కంచమ్మ తల్లి అమ్మవారికి జనవరి నెలలో భక్తుల సమర్పించిన హుండీ కానుకలను ఆదివారం లెక్కించారు. 29,040 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మద్దిల ఆనంద్ తెలిపారు. లెక్కింపులో కమిటీ ప్రతినిధులు గణప పాపారావు, వంకల ఉమాపతి, చక్రమహంతి బాబూరావు పాల్గొన్నారు.

డాక్టర్ కుమార్‌నాయక్‌కు ప్రశంసలు



జ్ఞాపికను అందుకుంటున్న కుమార్‌నాయక్

పలాస: పలాసకు చెందిన సినీ నటుడు, లయన్స్‌క్లబ్ డాక్టర్ కుమార్‌నాయక్ చేసిన సేవలకు ప్రశంసలు లభించాయి. శ్రీకాకుళంలోని ఓ హోటల్‌లో ఆదివారం లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ రీజినల్, జోన్ వన్ ఫంక్షన్ జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ ఓబులేసు చేతుల మీదుగా ప్రశంసా పత్రంతో పాటు జ్ఞాపికను అందుకున్నారు. కార్యక్రమంలో పలాస లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.అప్పారావు, తమ్మినేని మాధవరావు, తెప్పల కృష్ణమూర్తి, డాక్టరు ఆనందరావు, సిందిరి మధు పాల్గొన్నారు.

నీటి సమస్య లేకుండా చర్యలు



బోరును ప్రారంభిస్తున్న వసంతరెడ్డి

సంతబొమ్మాళి: ప్రజలకు మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి అన్నారు. గోవిందపురం పంచాయతీ పంగజగ్గపేటలో జెడ్పీ నిధులతో ఏర్పాటు చేసిన బోరింగును ఆదివారం ప్రారంభించారు. అలాగే సవరపేట గ్రామస్తులు తమ సమస్యలను జెడ్పీటీసీ సభ్యుడి దృష్టికి తీసుకురాగా.. స్పందించిన ఆయన రోడ్లు, డ్రైనేజీలను పరిశీలించి మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆర్.రామిరెడ్డి, సచివాలయం కన్వీనర్ కంబాల ఈశ్వర్‌రెడ్డి, కంబాల మాధవరావు, మర్ల రామారావు ఉన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఇచ్ఛాపురం: జగనన్న కాలనీలో లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు, హౌసింగ్ అధికారి సీహెచ్ మల్లేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇల్లు పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఇంటి స్థలాలను మంజూరు చేసిందన్నారు. దీంతో నిర్మాణాలపై ప్రజల్లో అవగాహన కల్పించామన్నారు. అయితే అవసరమైన మౌలిక వసతులను కల్పించక పోవడంతోనే నిర్మాణాలు సకాలంలో పూర్తిచేయలేక పోతున్నారన్నారు.

• సంబరం



లొద్దపుట్టి ధనరాజుల తులసమ్మ తల్లి సంబరం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సంతోషపురం గ్రామానికి చెందిన భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారిని మేళతాళాలు మధ్య ఊరేగించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కుబడులు తీర్చుకున్నారు. -ఇచ్ఛాపురం రూరల్

• శంకుస్థాపన



మండల కేంద్రం సోంపేట పట్టణంలోని సత్యనారాయణస్వామి దేవాలయం రాజగోపురం శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ చేతుల మీదుగా శంకుస్థాపన ప్రక్రియ చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నగిరి ప్రభావతి, ఉపసర్పంచ్ ఉత్తరాల వెంకన్న, ప్రతినిధులు లక్ష్మీనారాయణ, బంగారు నారాయణరావు, బొడ్డు కామేష్, బైరి సూరి, ఉత్తరాల వెంకటరమణ, ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు. -సోంపేట

• వార్షికోత్సవం



మున్సిపాలిటీలోని 12, 13 వార్డుల పరిధి.. బెల్లుపడ గ్రామ శివానందగిరిపై కొలువైన త్రినాథస్వామి వారి దేవాలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం మూలవిరాట్‌లకు ప్రత్యేక, చక్ర అభిషేకాలు చేశారు. అనంతరం సామూహిక కుంకుమార్చన, సహస్ర పసుపుకొమ్ములతో ప్రత్యేక పూజ కార్యక్రమాలను నీలగిరి రామకృష్ణ సిద్ధాంతి పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం జరిగిన తిరువీధిలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. -ఇచ్ఛాపురం

ఇంటింటా సంతోషం



ప్రజలకు సంక్షేమాన్ని వివరిస్తున్న సాయిరాజ్

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త సాయిరాజ్
- బుసాబద్రలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

సోంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని ప్రతి ఇంటా సంతోషం నెలకొందని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. బుసాబద్ర గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా వర్తించిన లబ్ధిని తెలియజేసి అందుకు సంబంధించిన బుక్‌లెట్లను అందజేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వం పాలన వ్యత్యాసాలను తెలియజేశారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రభుత్వ మంజూరు చేస్తోందన్నారు. నిరంతరం ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు ప్రజలంతా అండా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీడాప్ కార్పొరేషన్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు రౌతు విశ్వనాథం, నాయకులు బతకల విశ్వనాథం, పల్లి హరిశ్చంద్ర, మద్దిల లచ్చయ్య, గోకర్ల ధర్మారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

టెక్కలి: టెక్కలి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ శోభారాణి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. టెక్కలిలోని పట్టుమహాదేవి కోనేరు గట్టుపై ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి కార్యకర్త నియామకానికి బీసీ–బీ రిజర్వేషన్ ప్రాతిపదిక అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుకు పెద్దరోకళ్లపల్లి బీసీ–డీ, ఎస్‌బీ కొత్తూరు ఎస్సీ, ఆకాశలక్కవరం–2 బీసీ బీ, పోతునాయుడుపేట ఓసీ, అంట్లవరం బీసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే టెక్కలి మండలం భగీరథిపేట మినీ అంగన్‌వాడీ పోస్టుకు ఎస్సీ అభ్యర్థికి ఖరారు చేసినట్టు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కాశీబుగ్గ ఐసీడీఎస్ పరిధిలో..

కాశీబుగ్గ: కాశీబుగ్గ ఐసీడీస్ ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న కార్యకర్తలు, సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పీడీ డి.శర్వాణి తెలిపారు. వజ్రపుకొత్తూరు మండలం యు.జి.పురం, ఆర్.ఎం.పురం, పల్లివూరు, నందిగాం మండలం అనందపురం, తమలాపురం, కాపుతెంబూరు, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని ఒకటి, 29వ వార్డుల్లోని ఖాళీలను రిజర్వేషన్ల ప్రాతిపదికన భర్తీ చేస్తామన్నారు. అర్హత ఉన్నవారు ఈ నెల 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విశ్వబ్రాహ్మణ కుల సంఘ అభివృద్ధికి కృషి



సాయిరాజ్‌ను సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

సోంపేట: విశ్వబ్రాహ్మణ కుల సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. పాలవలస గ్రామం నేషనల్ హైవే ఫ్లైఓవర్ బ్రిడ్జ్ దగ్గర మామిడిపల్లి క్లస్టర్ పరిధిలోని విశ్వబ్రాహ్మణ కుల సంక్షేమ సంఘం ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో సాయిరాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘ భవనం నిర్మాణానికి జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ. 5 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సాయిరాజ్‌ను కుల సంఘ ప్రతినిధులు దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కర్తలపాలెం సర్పంచ్ పొందూరు గున్నయ్య, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సింహాద్రి ధనుంజయ ఆచారి, కార్యదర్శి దేవరకొండ షణ్ముఖరావు, మామిడిపల్లి క్లస్టర్ పరిధి అధ్యక్షుడు చిత్రాడ గంగారావు, మామిడిపల్లి క్లస్టర్ పరిధి కార్యదర్శి జవ్వాది గిరి, పొందూరు పార్వతీశం, పొందూరు బాబూరావు పాల్గొన్నారు.

కవిటి తహసీల్దార్‌పై చర్యకు డిమాండ్

కాశీబుగ్గ:



మాట్లాడుతున్న రాంబాబు

నిబంధనలు అతిక్రమించి బెంతు ఒడియా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన కవిటీ తహసీల్దారు ఆర్.అప్పలరాజు, సచివాలయ ఉద్యోగులపై చర్య తీసుకోవాలని ఆదివాసీ జేఏసీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు సవర రాంబాబు డిమాండ్ చేశారు. పలాసలోని గిరిజన బాలుర వసతి గృహంలో ఆదివారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. నకిలీ బెంతు ఒరియా (వడ్డీ/ఒరియా) కులస్తుల విషయంపై ప్రభుత్వ కమిషన్ వేసిందని.. ఇంతలోనే తహసీల్దార్, సచివాలయ ఉద్యోగులు అక్రమంగా ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడం తగదన్నారు. వీటిని ఖండించిన వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. దీనిపై జిల్లా ఎస్పీ రాధికకు ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. సమావేశంలో ఏఐఏఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సవర జగన్నాయకులు, నాయకులు వాబ యోగేశ్వరరావు, పెద్దింటి ఈశ్వరరావు, సవర భాస్కరరావు, వి.కృష్ణారావు, సవర గణష్, హేమలత, జన్ని సంజీవరావు, నాగేశ్వరరావు, విజయ్ ఉన్నారు.

ఘనంగా తెరవే కవి సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్:



సమావేంలో పాల్గొన్న కవులు

నగరంలోని శాంతినికేతన్ కళాశాల ఆవరణలో తెలుగు రచయితల వేదిక 77వ నెలవారీ సాహితీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా తెరవే అధ్యక్షుడు యు.నాగేశ్వరరావు మాట్లాడుతూ సాహిత్య విలువలు పెంపొందించేలా, సామాజిక బాధ్యతను గుర్తెరిగేలా సభ్యులంతా కవితలు రాయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రధాన కార్యదర్శి ఆర్.రమణమూర్తి మాట్లాడుతూ 76 నెలలుగా తెరవే ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలను వివరించారు. పలువురు కవులు తమ కవితలను వినిపించారు. కార్యక్రమంలో కె.తిరుమలరావు, ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ బి.కోమలరావు, ప్రసాదరావు, ఉపేంద్రశర్మ, తెప్పల కృష్ణమూర్తి, జగన్నాథరావు, ఇద్ది పాపయ్య, హరి సత్యనారాయణ, వి.రాజారావు, నిక్కు అప్పన్న, రెడ్డి లలిత పాల్గొన్నారు.

బస్సు సర్వీస్ పునరుద్ధరణ

నందిగాం: హరిదాసుపురం గ్రామానికి ఆర్టీసీ బస్ సర్వీసును అధికారులు ఆదివారం పునరుద్ధరించారు. గతంలో పలాస నుంచి పూండి మీదుగా హరిదాసుపురం గ్రామానికి రోజుకు రెండు సార్లు బస్సు వచ్చేది. అయితే పూండిలో రైల్వే అండర్ పాసేజ్ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో మూడు నెలలుగా బస్సు సర్వీసును నిలిపివేశారు. పనులు పూర్తికావడంతో బస్సు విషయాన్ని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ కణితి వెంకటరావు దృష్టికి స్థానిక సర్పంచ్ ధనలక్ష్మి తీసుకెళ్లారు. తక్షణం స్పందించి ఆయన పలాస డిపో మేనేజర్‌తో మాట్లాడి సర్వీసును పునరుద్ధరించారు. గతంలో తిరిగిన సమయాల్లోనే బస్సు నడుస్తోందన్నారు. సర్వీసు పునరుద్ధరించిన ఆర్ఎంకు కణితి నారాయణమూర్తి, కణితి క్రాంతి, కేశవరావులు ధన్యవాదాలు తెలియజేశారు.

బాధితుడికి ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం రూరల్: బెన్నుగానిపేట గ్రామానికి చెందిన గుడియా అర్జున్ గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదంలో రెండు కాళ్లను కోల్పోయాడు. దీంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న కవిటి మండలం కమలాయిపుట్టుగ గ్రామానికి చెందిన యువకులు అర్జున్‌కు ఎనిమిది వేల రూపాయలను ఆదివారం అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు.

కుళాయిలు ప్రారంభం



కుళాయిలను ప్రారంభిస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: మేజర్ పంచాయతీ కోటబొమ్మాళిలోని పెద్దపొందరవీధిలో కొత్తగా ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిలను సర్పంచ్ కాళ్ల సంజీవరావు, ఈవో యోగేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. వేసవిలో నీటి సమస్యరాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

చింతామణిని దర్శించుకున్న ఒడిశా బ్లాక్ చైర్మన్



మోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

కవిటి: ఒడిశా రాష్ట్రం పత్రపురం బ్లాక్ చైర్మన్ సాందిత్య మోహన్‌రెడ్డి కవిటిలోని చింతామణి అమ్మవారిని ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణ రావు, స్థానిక నాయకులు మోహన్‌రెడ్డిని దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

విశాఖ వెళ్లి..పింఛన్ అందజేసి..



హేమలయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ హిమబిందు

కాశీబుగ్గ: పలాస మండలం చినంచల ప్రాదేశికంలోని రాజగోపాలపురం గ్రామానికి చెందిన చాపర హేమలయ్య విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇతనికి ఈ నెలకు మంజూరైన వృద్ధాప్య పింఛన్‌ను వలంటీర్ హిమబిందు ఆదివారం ఆస్పత్రికి వెళ్లి అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. గ్రామస్తులు వలంటీర్‌ను అభినందించారు.

లాడ్జిల్లో తనిఖీలు

శ్రీకాకుళం క్రైమ్ : ఎస్పీ జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు నేర నియంత్రణ చర్యల్లో భాగంగా నగరంలోని లాడ్జీల్లో రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ వెంకటేష్ ఆదివారం తనిఖీలు చేపట్టారు. కస్టమర్ల రిజిస్టర్లను పరిశీలించి అనుమానితుల సమాచారం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పట్టణంలో అపరిచిత వ్యక్తులు చొరబడ్డారన్న సమాచారం మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఒరిజినల్ చిరునామా గుర్తింపు కార్డులను తనిఖీ చేసి రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు.

ముస్లింలను ఆదుకున్నది వైఎస్ కుటుంబమే



ఎమ్మెల్సీ దువ్వాడను సత్కరిస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: ముస్లింలను ఆదుకున్నది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబమేనని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. కోటబొమ్మాళి మండలానికి చెందిన పలువురు ముస్లిం కుటుంబాలవారు శ్రీనివాస్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. దివంగత నేత రాజశేఖరరెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. భవిష్యత్‌లో కూడా వారి అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు రంజాన్ రాజు, పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష



టెక్కలిలోని ఏపీ ఎంజేపీ పాఠశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

- 2,768 మంది విద్యార్థుల హాజరు

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలిలో ఆదివారం నిర్వహించిన నేషనల్ మెరిట్ మీన్స్ కమ్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) అర్హత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 12 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 2,768 మంది విద్యార్థులు హాజరయ్యారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, బాలికల ఉన్నత పాఠశాల, ఏపీఎంజేపీ పాఠశాల, బీఎస్ అండ్‌జేఆర్, మదర్ థెరిసా, ఆర్‌సీఎం, ఐజేహెచ్‌ఎస్, ఆదర్శ, రవీంద్రభారతి, అరుణా విద్యాలయం, అమ్మఒడి తదితర పాఠశాలలను కేంద్రాలుగా ఇచ్చారు. డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులంతా పరీక్షలకు హాజరయ్యారు. ఎంఈవో డి.నాగభూషణ్‌తో పాటు ప్రత్యేక బృందం పరీక్ష కేంద్రాలను సందర్శించారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీస్ సిబ్బంది ప్రత్యేక పర్యవేక్షణ చేశారు.

కల్వర్టు పునఃనిర్మాణ పనులు ప్రారంభం



కల్వర్టు పనులు చేస్తున్న దృశ్యం

టెక్కలి: టెక్కలి పీఆర్ రోడ్డులోని సంతోషిమాత ఆలయం వద్ద వరద నీటి సమస్యను పరిష్కరించే దిశగా తలపెట్టిన కల్వర్టు పునఃనిర్మాణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. గత టీడీపీ హయాంలో ఇదే ప్రాంతంలో సరైన ప్రణాళిక లేకుండా చేపట్టిన కల్వర్టు వలన ప్రస్తుతం వరద నీటి సమస్య తలెత్తుతోంది. దీంతో సమస్యను పరిష్కరించే క్రమంగా సుమారు రూ.19.99 లక్షలతో కల్వర్టు పునఃనిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అయితే ప్రధాన రోడ్డులో చేపడుతున్న కల్వర్టు పనుల దృష్ట్యా ట్రాఫిక్ మళ్లింపు విషయమై అధికారులు బహిరంగంగా ప్రకటన చేయకపోవడంపై వాహన చోదకులు మండిపడుతున్నారు. ట్రాఫిక్ మళ్లింపులో భాగంగా ఇందిరాగాంధీ జంక్షన్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. అలాగే చిన్నబజారుకు వెళ్లే మార్గం వద్ద కూడా ట్రాఫిక్‌ను మళ్లించే చర్యలు చేపట్టారు.

బోరు ఏర్పాటుకు భూమిపూజ



బోరు ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

మందస: మూలిపాడులోని చెరువు వద్ద ఆక్రమణలు ఇప్పటికే తొలగించామని ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు, ఈఓపీఆర్డీ ఇప్పిలి వెంకటరమణ, సర్పంచ్ గుసిరి వెంకటరావు తెలిపారు. మూలిపాడు పంచాయతీ అభివృద్ధిలో భాగంగా ఇక్కడ ఎస్‌డబ్ల్యూపీసీ నిర్మాణం చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఆదివారం బోరు నిర్మాణానికి భూమి పూజ చేశారు. స్థానికులు చెరువు ప్రాంతాన్ని ఆక్రమించడంతో వారిని ఒప్పించి, ఖాళీ చేయించామని.. ఈ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఇక్కడ ప్రభుత్వ కార్యాలయం నిర్మాణానికి సరిపోయే స్థలం కూడా ఉందన్నారు. అధికారుల సహకారంతో మొక్కలను పెంచుతామని సర్పంచ్ వెంకటరావు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గౌరహరిమహంతి, పంచాయతీ కార్యదర్శి బి.రమణ, ఫీల్డ్ అసిస్టెంట్ తెలుకల మురళీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వినోద్ కుమార్ పాణిగ్రాహి, పసుపురెడ్డి మురళీ, పిట్ట భీమారావు, జయరాం, చంద్రరావు ఉన్నారు.

కోఆప్షన్ సభ్యుడికి మంత్రి పరామర్శ



అంత్యక్రియలకు హాజరైన మంత్రి అప్పలరాజు తదితరులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు రోణంకి శ్రీనివాసరావు తల్లి లచ్చెమ్మ (71) ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు, పలువురు కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు ఆరో వార్డు పరిధి పెసరపాడు గ్రామంలోని శ్రీనివాసరావు ఇంటికి చేరుకొని పరామర్శించి సంతాపం తెలియజేశారు. లచ్చెమ్మ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్కేటింగ్ పోటీలు



విజేతలతో స్వామినాయుడు, తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం రూరల్: జిల్లా స్థాయి స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. గాయిత్రి కళాశాలలో జరిగిన ముగింపు, బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో గోమతేష్ ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాడు. కార్యక్రమంలో ఆర్ఆర్ఎస్ స్కేటింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విశిష్టమైనది మాఘస్నానం



వక్తను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: మాఘమాసంలో నదులు, గెడ్డలు, చెరువుల్లో స్నానాలు చేయడం ఎంతో విశిష్టమైనదని వక్త డాక్టర్ బారువ కోమలరావు అన్నారు. ఆదివారం నగరంలోని ఉపనిషన్మందిరంలో మాఘస్నానంపై ఉపన్యసించారు. సూర్యుడు మకరరాశిలో ఉన్నప్పుడు చేసే స్నానాన్ని మాఘస్నానం అంటారని చెప్పారు. మాఘమాస మహత్యాన్ని వివరించారు. కార్యక్రమంలో పతంజలిశాస్త్రి, ఎం.శ్రీనివాసరావు, వెంకటరమణ, సరస్వతి, చాగంటి బాపయ్యపంతులు, పి.వి.ఎస్. ప్రసాద్, మందుల మోహనరావు, ఎంఏ భట్లు తదితరులు పాల్గొన్నారు.